క్లుప్తంగా

భద్రాద్రి సమస్యలపై గవర్నర్‌కు వినతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రాంతాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి సోమవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ను ఆయన ఒక ప్రకటన ద్వారా కోరారు. ఈ మేరకు ఆమెకు వినతిపత్రం పంపనున్నట్లు ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి తరపున బూసిరెడ్డి శంకర్ రెడ్డి లేఖ రాశారు. తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత భద్రాచల ప్రాంతం పూర్తిగా నిరాకారంగా మారిపోయిందని, ఈ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజన, గిరిజనేతర బడుగు బలహీన వర్గాల జీవితాల్లో నీలి, నీడలు కమ్ముకున్నాయని లేఖలో పేర్కొన్నారు. సమస్యలపై దృష్టి సారించి ఈ ప్రాంత అభివృద్ధికి బంగారు బాటలు వేయాలని గవర్నర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

దుమ్ముగూడెం: నర్సాపురం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలందరూ కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వర్సా శివరామకృష్ణ అన్నారు. సోమవారం నర్సాపురం రైతు వేదికలో కంటివెలుగు కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలోని ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో దృష్టి లోపాలు ఉన్నటువంటి వారికి మందులు అవసరమైనటువంటి వారికి కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రావులపల్లి రవి కుమార్, నర్సాపురం పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్, ఆప్త మాలజిస్ట్ అసిస్టెంట్ కొండయ్య, సిబ్బంది బాబురావు, రమణమ్మ, పూర్ణ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్స్ పంచాయతీ కార్యదర్శి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయండి

చండ్రుగొండ: మండలంలోని సీతాయిగూడెంలోని భారీ సాగునీటి వనరైన వెంగళరాయసాగర్‌కు మరమ్మతులు సత్వరమే చేపట్టాలని ఏజెన్సీ దళితుల సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు నడి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2200 ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు మూడేళ్లక్రితం అలుగుకు గండిపడినా నేటి వరకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పట్టించుకోవడం లేదన్నారు. ఫలితంగా రెండేళ్లుగా తిప్పనపల్లి, మహ్మద్‌నగర్ గ్రామాల్లోని రైతులు భూములు బీడువారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సత్వర చర్యలు తీసుకోని పక్షంలో రైతులతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడ్తామని ఆయన హెచ్చరించారు.

వేతనాలు ఇవ్వాలి


గ్రామ పంచాయతీ అధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు సోమవారం వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బల్లా సాయికుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు గత రెండు నెలల నుంచి వేతనాలు రాకపోవటం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వేతనాలను విడుదల చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాయల రాములు, గుంజ చెన్నకేశవ, పోలిశెట్టి శ్రీనివాస్, గుంజ ఎంకన్న, రాయలు సాయి, పుష్ప, చెంచల శ్రీను, నాగరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఆగేలా చూడాలి

అశ్వాపురం: మండల కేంద్రంలో తురుముల గూడెం నుంచి రైల్వేస్టేషన్ రోడ్డుకు రూ.2 కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన చేయడంపై అశ్వాపురం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ భూక్యా చందూలాల్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన అశ్వాపురంలో విలేకరులతో మాట్లాడారు. రహదారికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రేగా కాంతారావుకు ఈ ప్రాంత ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. భారజల కర్మాగారం, బీపీఎల్ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికుల సౌకర్యం దృష్ట్యా మణుగూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే సూపర్‌ఫాస్ట్ రైలు అశ్వాపురం రైల్వే స్టేషన్‌లో నిలిపేలా, స్టేషన్‌లో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ ప్రాంత ప్రజల సౌకర్యం దృష్ట్యా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు ఈ సమస్యపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

సిగ్నళ్లు అలంకారప్రాయమేనా..?

- పట్టణంలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు
- ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులు
- నిత్యం ఏదో ఒక సాంకేతిక లోపం
- పట్టింపులేని అధికారులు


అంబేడ్కర్ సెంటర్ వద్ద అస్తవ్యస్తంగా వెళ్తున్న వాహనదారులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో సిగ్నళ్లు కీలకం. వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్తూ ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు వీటిని ఏర్పాటు చేస్తారు. అయితే భద్రాచలం పట్టణంలో ఉన్న ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణ కొరవడింది. అవి అలంకారప్రాయంగా మారాయి. మొదట్లో బాగానే ఉన్నా ఆ తర్వాత కొన్ని రోజులు పనిచేయలేదు. స్పందించిన అధికారులు వీటిని ఐటీసీ సంస్థ, స్థానిక సీఐ సంయుక్తంగా బాగు చేయించారు. అయినప్పటికీ ఆయా సమయాల్లో ఏదో ఒక సాంకేతిక లోపంతో పనిచేయడం లేదు. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా నిరుపయోగంగా మారాయి.

మూడు చోట్ల..

పట్టణం లోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్య తీవ్రం అవుతుందనే ఉద్దేశంతో గతంలో అధిక మొత్తంలో వెచ్చించి అంబేడ్కర్ సెంటర్ వద్ద రెండు, పాత మార్కెట్ వద్ద ఒక ట్రాఫిక్ సిగ్నళ్లను బిగించారు. మొదట్లో బాగానే పనిచేసినా గత కొంత కాలంగా ఇవి పనిచేయడం లేదు. అధికారులు వీటిని ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు పూర్తి స్థాయిలో పని చేసిన దాఖలాలు లేవు.

అస్తవ్యస్తంగా ట్రాఫిక్..

ఏ వాహనం మైనా అటు సారపాక వెళ్లాలన్న లేదా అంతకంటే దూరం వెళ్ళాలన్నా, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే వాహనాలు లేదా చర్ల, దుమ్ముగుడెం నుంచి వచ్చే వాహనాలు అధికంగా రాకపోకలు భద్రాచలం మీదగానే సాగిస్తుంటారు. భద్రాచలం పట్టణంలో వివిధ ప్రాంతాల నుంచి భారీ, అతి భారీ వాహనాలు నిత్యం ఏదో ఒక పని మీద వస్తూ ఉంటాయి. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవకుండా కొన్నేళ్ల కిందట ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి తీసుకొచ్చారు. నిర్వహణ కొరవడి అవి కాస్త అలంకార ప్రాయంగా మారాయి. ఆయా దారులన్నీ ఎప్పుడూ బిజీగా ఉంటాయి. పలువురు వాహనాలు అతివేగం, నిర్లక్ష్యంగా నడపడం సామర్థ్యానికి మించి వాహనాల్లో ప్రయాణికులను చేరవేస్తుండటం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫలితంగా ఇక్కడ రద్దీ పెరిగింది. ఇదే సమయంలో సిగ్నళ్లు లేక వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్తుండటంతో తోటి ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాల సంభవించే అవకాశం ఉంది. కాస్త దృష్టి సారించి మరమ్మతులు చేయిస్తే సరిపోతుంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పార్కింగ్ లేని ప్రాంతాల్లో సైతం వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువతుంది. పోలీస్‌స్టేషన్ నుండి పెట్రోలింగ్ వాహనాలు వచ్చినప్పుడే రోడ్డుపై ఉన్న వాహనాలను పక్కకు పెడుతున్నారు.. తరువాత యథావిధిగా పెడుతున్నారు. దీంతో వచ్చిపోయే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో అయితే అప్పుడప్పుడు నడిచి వెళ్లేందుకు దారి లేకుండా పోతుంది. ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో కాస్తా వాహనాల రద్దీ తగ్గినప్పటికి సాయంత్రం , ఉదయం సమయాల్లో అయితే వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో ప్రయాణికులు నడిచి వెళ్లాలంటేనే ఎన్నో అవస్థలు ఎదుర్కొవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముఖ్య కూడలిలో సిగ్నల్ వ్యవస్థను సరిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించేందుకు కృషి



సాంకేతిక లోపం కారణంగా ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయడం లేదు. ఇప్పటికే ఈ సమాచారాన్ని పై అధికారులకు తెలియజేశాం. అదే విధంగా టెక్నిటీయన్‌కు కూడా ఇప్పటికే పిలిపించడం జరిగింది. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. రోడ్డుపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించ కూడదు.

– పీఎమ్ఎస్ రావు, ట్రాఫిక్ ఎస్సై, భద్రాచలం

ప్రత్యేక దృష్టి సారిస్తాం..



పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నాం. సిగ్నల్స్ వ్యవస్థలో సాంకేతిక లోపంతో పనిచేయడం లేదు. అయితే ఈ సమస్యను ఏదుర్కోనేందుకు అక్కడ ట్రాఫిక్‌కి సంబంధించిన కానిస్టేబుల్స్‌ను ఏర్పాటు చేశాం. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు పట్టణంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– పి.నాగరాజు రెడ్డి, సీఐ, భద్రాచలం

సమావేశానికి అధికారులు డుమ్మా


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సున్నం లలిత

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఎంపీపీ సున్నం లలిత అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో కొన్ని శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బుడేన్ అధికారులు లేకుండా సమావేశం ఏర్పాటు చేయడం ఎందుకు అని, వాయిదా వేయాలని ఎంపీడీఓ రేవతిని కోరారు. ఎంపీపీ సున్నం లలిత సైతం ముఖ్య శాఖలకు చెందిన అధికారులు హాజరుకాకుండా సమావేశం నిర్వహించినంత మాత్రాన సమస్యలు పరిష్కారం కావన్నారు. దీంతో ఎంపీడీఓ రేవతి ప్రస్తుత సభను వాయిదా వేస్తూ.. మరో 15 రోజుల్లో మరలా ఏర్పాటు చేసేందుకు నిర్ణయిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశానికి హాజరు కానీ అధికారులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని, ఆయా శాఖలకు చెందిన అధిపతులకు సమాచారం అందిస్తామని తెలిపారు. అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో ప్రజాసమస్యలపై పట్టింపేదని ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సమావేశానికి హాజరైన అధికారులు తమ శాఖల నివేదికలను చదవి వినిపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, ఎంపీఓ షాబ్నా, ఎంపీటీసీ కాకా సీత, సర్పంచ్‌లు బోడా పద్మ, సురేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలకు బాలామృతం

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీకొత్తూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇటుక బట్టీలలో పని చేస్తున్న వలస కూలీల పిల్లలకు, గర్భిణులకు 73 మందికి సోమవారం సర్పంచ్ మర్రి మల్లారెడ్డి బాలామృతం, గుడ్లు, పాలు, బియ్యం, నూనె, పప్పు అందజేశారు. కార్యక్రమంలో మల్లెలమడుగు సెక్టార్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ శైలజ, ఆయా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు అవగాహన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్లో చికిత్స పొందుతున్న పలువురు కిడ్నీ వ్యాధిగ్రస్తులను నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ మణి సోమవారం పరిశీలించి అవగాహన కల్పించారు. వారి సమస్యలకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఆయన వెంట క్లస్టర్ ఇన్‌చార్జ్ సుమంత్, సెంటర్ ఇన్‌చార్జ్ అనూషలు ఉన్నారు.

రహదారుల నిర్మాణాలకు నేడు శంకుస్థాపన

అశ్వాపురం: మండలంలో ప్రధాన రహదారుల నిర్మాణాలకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు నేడు శంకుస్థాపన చేయనున్నారు. ఆర్ అండ్‌బీ రోడ్డు రామచంద్రాపురం నుంచి వయా కొత్తూరు ఇరవెండి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రూ.2 కోట్లతో, ఆర్‌అండ్‌బీ రోడ్డు గొల్లగూడెం నుంచి సర్వాయిపాడుబంజర వరకు రూ.1.40 కోట్లతో, సంద్రలబోడు నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు రూ.1.00 కోట్లతో, తురుములగూడెం నుంచి గొందిగూడెం వయా అశ్వాపురం రైల్వేస్టేషన్ వరకు రూ.2 కోట్లతో, గొందిగూడెం నుంచి ఎలకలగూడెం వరకు రూ.2 కోట్లతో, ఎలకలగూడెం నుండి మనుబోతులగూడెం వరకు రూ.6.67 కోట్లతో నిర్మించనున్నట్లు బీటీ రోడ్లకు ఎమ్మెల్యే రేగా శంకుస్థాపన చేయనున్నారు.

ఎమ్మెల్యే రేగా ప్రత్యేక చొరవతో రహదారులకు నిధులు మంజూరు చేయించి నేడు శంకుస్థాపన చేస్తున్న సందర్భంగా జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, యువజన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, సర్పంచ్‌లు కాక అశోక్, పర్శిక సూరిబాబు, కలేటి నరసింహారావు, ఏనిక స్వరూప, బాణోత్ శారద హర్షం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన ఎమ్మెల్యే రేగాకు, సీఎం కేసీఆర్‌కు ప్రజా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

భద్రత లేకుండానే పైపుల తరలింపు


లారీ నుంచి కింద పడిపోయిన ఇందిరా సాగర్ ప్రాజెక్ట్ ఐరన్ పైపు


లారీపై ఉన్న పైపులు తగలడంతో విరిగి పడిపోయిన కరెంట్ స్తంభం

దమ్మపేట: పది మీటర్ల వ్యాసం గల ఇందిరా సాగర్ ప్రాజెక్ట్ పాత పైపులను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా, భద్రత ప్రమాణాలు పాటించకుండా ట్రాలీ లారీలపై తరలిస్తున్నారు. మండల పరిధిలోని అర్లపెంట గ్రామ పరిసర ప్రాంతాల నుండి ఇందిరా సాగర్ ప్రాజెక్ట్ పాత పైపులను లారీలపై, గొలుసు లేదా తాడుతో సరిగా కట్టకుండా తరలిస్తున్నారు. ఈ కారణంగా మండల పరిధిలోని అంకంపాలెం గ్రామంలో వారం క్రితం లారీ ట్రాలీపై ఉన్న పైపు దొర్లి కిందపడింది. అంతేగాక సుధాపల్లి గ్రామంలో లారీపై ఉన్న పైపు తగిలి కరెంటు స్తంభం కూడా విరిగిపోయింది. ఆ సమయంలో ఎవరూ రోడ్డుపై లేకపోవడం వలన భారీ ప్రమాదమే తప్పిందని స్థానికులు వాపోయారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి పైపులను తరలించే వారు సరియైన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్టీసీతోనే సురక్షిత ప్రయాణం


మాట్లాడుతున్న డిపో మేనేజర్ స్వామి

మణుగూరురూరల్: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితంగా ప్రయాణించాలని మణుగూరు డిపో మేనేజర్ స్వామి అన్నారు. మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎం స్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సురక్షిత, సుఖవంతమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలన్నారు. ప్రైవేట్ వాహనాల కంటే తక్కువ ఖర్చుతో సురక్షితంగా ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. ప్రజలందరూ ఆర్టీసీని ఆదరించి డిపో అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాము, ఆంజనేయులు, శివప్రసాద్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి అభివృద్ధికి నిధులు తేగలరా?



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్

భద్రాచలంటౌన్: భద్రాద్రి అభివృద్ధికి తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రకటించిన నిధులను అడిగే దమ్ము రేగాకి ఉందా.. అని భద్రాచలం డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతిరేల సుధీర్ ప్రశ్నించారు. భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన డివిజన్ యూత్ కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు భద్రాచలం వచ్చిన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ భద్రాద్రి రామాలయ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేస్తామని ప్రకటించిన తొమ్మిది ఏళ్లు గడుస్తున్నప్పటికీ పైసా ఇవ్వలేదు గాని కొండగట్టుకు రూ.100 కోట్ల నిధులు మంజూరి చేస్తుంటే రేగా ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. ఇప్పటికైనా భద్రాద్రిపై మీ అధినాయకత్వానికి ప్రేమ ఉంటే భద్రాద్రి అభివృద్ధికి సీఎం కేసీఆర్ రెండు సార్లు ప్రకటించిన నిధులను వెంటనే విడుదల చేసే విధంగా రేగా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్, రాంప్రసాద్, కొత్త నిఖిల్, శ్యామ్, శోభన్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి విప్ రేగా పరామర్శ


భద్రాచలంఅర్బన్: బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న విప్ రేగా కాంతారావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గోదావరి నదిలో ఆదివారం మునిగి చనిపోయిన పిల్లల కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, నుగురు మార్కెట్ కమిటీ చైర్మన్ బోధ బోయిన బుచ్చయ్య, బీఆర్ఎస్ భద్రాచలం మండల అధ్యక్షుడు అరికెల్ల తిరుపతిరావులు పరామర్శించారు.

ఏరియా ఆస్పత్రికి వెళ్లి మృతుల భౌతిక దేహాలను సందర్శించారు. సంతాపం తెలిపారు. చిన్నారుల మృతి బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రేగాతో పాటు వైస్ ప్రెసిడెంట్ చింతాడి చిట్టిబాబు, దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు అన్యం సత్యనారాయణమూర్తి, యూత్ డివిజన్ అధ్యక్షుడు మల్లెల లోకేష్ తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

జ్వరం బాధితుడికి..

అశ్వాపురం: డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ భద్రాచలంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని అమెర్ద గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యుడు నజీర్‌ను సోమవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆసుపత్రిలో పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ యుజవన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ యువజన నాయకులతో కలిసి ఆస్పత్రిలో నజీర్‌షోనును పరామర్శించారు.

చెత్త తీశారు.. ఆపై మరిచారు..


భగవాన్‌దాస్ కాలనీలో రోడ్లపైనే ఉన్న చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు

భద్రాచలం: భద్రాచలంలోని పలు కాలనీల్లో గ్రామ పంచాయతీ కార్మికులు పారిశుద్ధ్య పనులను చేపడుతున్నారు. డ్రైయినేజీల్లో చెత్తా చెదారాలను తొలగిస్తూ, అడ్డంగా ఉన్న చెట్లను నరికివేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆ చెత్తా చెదారాన్ని సకాలంలో తీసివేయటంలో మాత్రం కార్మికులు అశ్రద్ధ చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన పై అధికారులు సైతం అలసత్వం వహిస్తున్నారు. దీంతో ఆ చెత్తా చెదారం రోడ్లపైకి వచ్చి నడువ లేని దుస్థితి నెలకొంటుంది. ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలు రోడ్ల మీదకు రావడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వీటిపై గ్రామపంచాయతీ ఈఓ ప్రత్యేక శ్రద్ధ వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సామాజిక సేవలో మేటి

- పేదలు, రోగులకు అండగా రాధ
- ఆపద సమయాల్లో సహకారం
- దానధర్మ ట్రస్టుతో విశిష్ట సేవలు


వరద ముంపు ప్రాంతాల్లో నిత్యావసర సరుకులు అందజేస్తున్న రాధ


గ్రామాల్లో నిరుపేద పిల్లలకు దుస్తులు అందజేస్తూ..


క్రీడాకారులకు మెమెంటో అందజేస్తున్న రాధ

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం ప్రాంతానికి చెందిన గంటా రాధ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ తోటి మహిళలకు మరింత నిలుస్తున్నారు. ఓసమాన్య కుటుంబానికి చెందిన రాధ.. మణుగూరు ప్రాంతంలో తొలి మహిళా జర్నలిస్టుగా పనిచేశారు. ఇదే వృత్తిలో 15 సంవత్సరాలు రానించారు. ఆపై తన ప్రాంతానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో ధాన దర్మ ట్రస్టు ఏర్పాటు చేశారు. ఆ ట్రస్టుతో మణుగూరు ప్రాంతంలో అనేక రకాల సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

వరదల సమయంలో ఆపన్నహస్తం

వరదల సమయంలో అన్నారం, కమలాపురం గ్రామాలకు చెందిన ఇళ్లు మొత్తం నీట మునగడంతో ఆ గ్రామంలోని 300ల కుటుంబాలకు సుమారు 15రోజుల పాటు భోజనాలు, అల్పాహారం ఏర్పాటు చేశారు. నీటమునిగిన వారికి పడవల్లో ప్రయాణం చేసి స్వచ్ఛందంగా సేవలు అందించారు. ఆయాగ్రామాల ప్రజలకు నెల రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు బియ్యం అందించి ఆదుకున్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేదలకు వైద్య సేవలు అందించారు.

నిరుపేదలకు అండగా..

పినపాక నియోజకవర్గంలోని నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అనారోగ్యంతో బాధపడేవారికి ఆర్థిక సహాయం అందించడంతోపాటు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారి ఇండ్లలో చనిపోయిన వారికి దహన సంస్కారాల కోసం రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అన్నారం గ్రామానికి చెందిన సుమారు 30 మంది మహిళలతో కలిసి ప్రతి నెలలో ఒకరోజు కూలీ పనులు చేసి ఆరోజు వచ్చిన కూలీని నిరుపేద కుటుంబాలకు అందిస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి చేయూత..

అన్నారం గ్రామంలో గత ఏడాదిగా వరుస మరణాలు జరుగుతున్నాయి. పరిష్కారంగా ఆ గ్రామంలో ఆలయం నిర్మించాలని కొందరు చెప్పడంతో విషయం తెలుసుకున్న రాధ గ్రామస్తులతో మాట్లాడి ఏకం చేసి ఆగ్రామంలో తాను స్వయంగా సీతామ చంద్రస్వామి ఆలయ నిర్మాణం చేట్టారు. అనేకమంది దాతలను కలిసి గ్రామంలో ఆలయ నిర్మాణం చేసి అత్యంత వైభవంగా ఆలయ నిర్మాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేశారు. అప్పటినుంచి ఆగ్రామంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటున్నారని గ్రామస్తులు చెబుపుతున్నారు.

18 జంటలకు వివాహం..

రాధ దాన ధర్మ ట్రస్టు ఆధ్వర్యంలో 18 జంటలకు సాముహిక వివాహలు చేసి సహాయం అందించారు. వెళ్లి చేసిన ప్రతి జంటకూ రూ.15,000లు ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపారు. అదే విధంగా ములుగుజిల్లాలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన 40 కుటుంబాలకు సుమారు రూ.3లక్షల విలువైన నిత్యావసర సరులు అందించి ఆదుకున్నారు.

సామాజిక సేవతో సంతృప్తి



ఎన్నో ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొని చేస్తున్న ఈ సమాజిక సేవా కార్యక్రమాలు ఎంతో సంతృప్తిని నింపుతున్నాయి. తాను చేస్తున్న సేవలకు ఎంతో మంది మిత్రులు, అధికారులు చేస్తున్న సహకారం మరువలేనిది. నా సేవలను గుర్తించిన లయన్స్‌క్లబ్ వంటి సంస్థలు ఎంతగానో అభినందించడం సంతోషాన్ని కలిగించాయి. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాలు చేపడుతున్నాను.

– గంటా రాధ, దానధర్మ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు